## ఆదివారం కథ

(10వ పేజీ తరువాయి)

మారేస్తోంటే, ఆత్మీయతా, అనురాగాలున్న ప్రసాద్‌ని ఊతగా పట్టుకోవాలని ఆరాటపడుతోంది తన మనస్సు. ఇందులో అసహజమేమీ లేదనిపించింది ఆమెకు.

ఆటు తర్వాత రెండేళ్లకు గామోలు హిమాయత్‌నగర్‌లోని సూపర్ బజార్లో ప్రసాదుకి ప్రియంవద కనిపించింది.

ఆమె మొహంలో విషాదం స్పష్టంగా కనిపించింది అతనికి. తొలి పలకరింపులయింతర్వాత.

"ప్రియంవదగారూ, మీరు భద్రాచలంలోనూ ఏదో దుఃఖంతో ఉన్నట్లు కనిపించారు. ఇప్పుడూ మీలో ఏదో విషాదం. నన్ను మీ ఆప్తునిగా భావించి మీ కష్టమేమిటో చెబితే నా చేతనైన సాయం చేస్తాను" అంటే ఆమె..

"ఏం చెప్పమంటారు? ఆయన ఊళ్లో వుండేది నెలకి పదిరోజులే. ఆ పదిరోజులయినా ఇంటి దగ్గరుండరు. ఆయన కెంపులో స్నేహితులు, స్నేహితురాళ్లానూ. ఎన్నో వ్యాపకాలూ, ఎన్నెన్నో వ్యసనాలు. మద్యం, మనీ, మగువ ఇవుంటే చాలు ఆయనకి నేను అక్కర్లేదు. లోకం చూడటానికి మాత్రం భార్యగా ఒక చందనపు బొమ్మ కావాలి. కాని తనలా ఆ భార్యకూ ప్రేమా, అనురాగం, అభిమానం అవసరమని ఆయన అనుకోరు. తన భార్యకూ ఒక మనసుందనీ, ఆమెకూ శారీరకంగానూ, మానసికంగానూ కోరికలుంటాయనీ నమ్మ బొమ్మను నేను. ఆయన నివాసం పేరుకు మాత్రమే నా దగ్గర. ఆయనకు మరో సంసారముంది. ఇక్కడున్నప్పుడు మాత్రం నాకో నరకం సృష్టించి పోతుంటారు. ఆయన కామానికి బలికావడానికి మటుకు నేను పనికొస్తుంటాను" అని ఒక క్షణం ఆగి ఆమె మళ్లీ "నాకేమని పిస్తోందో తెలుసా ప్రసాద్‌గారూ! తన అధిపత్యాన్ని చూపించుకోవడం, భార్యని హింసించడం, ఏడ్పించడం ఇవే పురుషుడికున్న నేటి పురుషార్థాలు!" ఆమె వ్యథ చూస్తుంటే మనిషికి నిజంగా ప్రేమ పిపాసకు మించిన పిపాస మరొకటి లేదనిపించింది.

* *** *

ఒక సాయంత్రం ఆఫీసునుంచి ఇంటికెళుతుంటే ప్రసాద్ కారుకి గగన్‌మహల్ సందులోంచి ఒక స్త్రీ అడ్డొచ్చింది. ఆమె అలారావడం చూసి ప్రసాద్ స్టీరింగును ఎడమకి తిప్పి, కారు నాపేడు. కారు ఆమెను ఢీకొందనే భయపడ్డాడు ప్రసాద్. కారు దిగి ముందుకు ఆమెవైపు నడిచాడు. ఆ స్త్రీ మెరుపులా అతన్నొకసారి చూసి, ఓ విరునవ్వు నవ్వి మళ్లో సందులోకి మాయమయింది. అలా ఆమె నవ్వినప్పుడు ఆ కళ్లు తళుక్కున మెరిశాయి. మొహంలో వేయి మతాబులు వెలిగాయి. అతి కొద్ది సమయంలోనే ఆ కొన్ని క్షణాలలోనే ప్రసాద్ ఆమెను గుర్తించాడు. ప్రియంవదే. వారిద్దరి మధ్య ఆ క్షణం మౌనమే రాజ్యమేలింది. ఆ మౌనంలోనే పరస్పరం 'మీరా' అంటే 'మీరా..' అని కళ్లతోనే పలకరించుకున్నారు.

చందనపు బొమ్మలావున్న ప్రియంవద దం

[illegible]

యుంది. ఆమె చూపుల్లో ఏదో మూగ బాధ. ఏదో దీనత్వం. అస లే ప్రపంచమంటేనే భయ



పడుతున్నట్లుందామె. మరిప్పుడు తనేం చేయాలి? అస్సలు ఆమె కోసం తనేమైనా చేయగలడా?

ఆ చుట్టుపక్కల ఆమె కోసం వెదికాడత

[illegible]

వెదికాడు. అలసిపోయిందాకా వెతికాడు. కానీ ఎంత వెతికినా ఆమె కనిపించలేదు! సరే. వెనక్కి తిరిగొచ్చి కారుస్టార్టు చేశాడు. వేగంగా పరుగెడుతోంది. అతని మనస్సు మాత్రం పక్షిలా ఆ కారు కిటికీలోంచి బయటికెగిరి రోడ్డుమీద ఆమె కోసం వెతుకుతూనే వుంది. అతని మనస్సులో ఏదో ఆరాటం ఏదో ఆతురత.. ఏదో తపన. ఒక స్త్రీ కళేబరానికి ప్రియంవద ఛాయ పులిమినట్లనిపించిందతనికి. తను చూసిన ప్రియంవదను తలుచుకుంటే అతని హృదయంతలో శత కోటి పిడుగులు పడినట్లయింది. కాని వెంటనే.

"ఈమె గురించి నేనింతగా ఆలోచిస్తున్నానేం? ఆమె నాకేమీ కాదే? మా మధ్య ఎలాంటి సంబంధమూ లేదు. ఆమె బాగోగుల్ని గురించి ఆలోచించవలసింది ఆమె భర్త వేణు. అతను చేయని పనిని నేను చేయగలనా? ఒకవేళ ఏదైనా చేయగలిగితే ఎందుకు చెయ్యాలి? పోనీ చేస్తేనేం? అన్న ఆలోచనలతో అతని మనస్సు ఊగిసలాడుతోంది. కారుని రోడ్డువారగా ఆపి అందులోంచి దిగాడు. దానికానుకుని నిల్చుని ఆలోచించడం మొదలెట్టాడు. తనిప్పుడేం చేయాలి? వెనక్కి వెళ్లి ఆమె కోసం మళ్లీ వెతకాలా? ఆమె కనిపిస్తుందా? ఒకవేళ కనిపించినా తనేమయినా చేయగలిగినా ఈలోకం, ఈ సమాజం వీటి మాటేమిటి? అయినా కొందరి జీవితాలిలా ఎందుకు నాశనం అవుతాయి? వాళ్ల జీవితాల్లో ప్రళయాలెందుకు వస్తాయి? పిడుగులెందుకు పడతాయి? సమాధానం లేని ఈ

ప్రశ్నలకి అతని మనస్సులో ఏదో అలజడి! ఎందుకో అశాంతి! తనికిప్పుడు కావలసింది మనశ్శాంతి. తేరుకుని చుట్టూ చూస్తే తనున్నది ఆబిడ్స్ షాపింగు సెంటర్లో పోలీసు స్టేషన్ దగ్గరలో. పది అడుగుల దూరంలో ఎడమవైపు దేవాలయం, కుడివైపు బారూవున్నాయి. తన క్కావలసిన మనశ్శాంతి కోసం తనిప్పుడు ఎటు తిరగాలి? ఎందులోకి వెళ్లాలి?

అసలు జీవితమంటే ఏమిటి? ప్రేమ, స్నేహం, ఆత్మీయత, కరుణ, దయ, మానవత్వం ఇవే. అయితే ఈ అందమైన తెరల్ని తీసివేస్తే కనిపించే నగ్నజీవితాన్ని చూసి ఎవరైనా భరించగలరా? ఇలాంటి జీవితాన్ని తనో గంట క్రితం చూశాడు. అది చూశాకే తనకీ అశాంతి!

తన వైవాహిక జీవితంలో ప్రియంవద అనుభవించిన బాధలు ఒక భార్య, తల్లి, చెల్లి, కూతురు ఏ పేరుతో పిలిచినా పలికే ఒక భారత స్త్రీ మూగ రోదన.ఈ రోదనని వర్ణించడానికి ఈ ప్రపంచంలోని ఏ భాషలోనూ చాలినన్ని పదాలు లేవు. ఎంతటి కవికైనా వర్ణించడానికి మాటలు చాలవు.

ఇలా ఆలోచిస్తూ అడుగు ముందుకు వేశాడేకానీ, ఎడమకో కుడికో తేల్చుకోలేక తికమక పడుతున్నాడు.

కాని గగన్‌మహల్ ప్రాంతంలో తననించి తప్పించుకుని సందుల్లోకి పరుగెత్తిన ప్రియంవదను వెతుక్కుంటూ వచ్చిన వేణు ఆమెను తన కారులో ఎక్కించుకునిపోయాడని పాపం ప్రసాద్‌కు తెలియదు మర్నాడామెను మెంటల్ హాస్పిటల్‌లో చేర్పించడానికి!! ●